

కొత్త రేషన్ కార్డులు జారీ ఎప్పుడో..

- గత ప్రభుత్వంలో ఏడేళ్లుగా మంజూరు చేయని కొత్త కార్డులు
- ఆరు గ్యారెంటీల అమలుకు అవే కీలకం
- కార్డుల్లేక ఇప్పటికే గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల్లో పొందని లబ్ధి
- రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టాలని కోరుతున్న లబ్ధిదారులు
- సన్న బియ్యం, నిత్యావసర సరకుల పంపిణీకి ప్రభుత్వం ప్రయత్నం

జిల్లాల వారీగా రేషన్ కార్డులు, లబ్ధిదారుల సంఖ్య

జిల్లా	రేషన్ కార్డులు	లబ్ధిదారుల సంఖ్య	బియ్యం (మెట్రిక్ టన్నుల్లో)
మహబూబ్‌నగర్	2,39,514	7,80,979	5,085.071
నారాయణపేట	1,40,321	5,08,486	3,217.896
గద్వాల	1,60,109	5,45,813	3,461.185
వనపర్తి	1,57,100	5,16,194	2,500.117
నాగర్‌కర్నూలు	2,37,821	7,50,241	4,819.906
మొత్తం	9,34,865	31,01,713	19,084.175

మహబూబ్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసింది. మళ్లీ స్థానిక సంస్థల కోడ్ వచ్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు, ప్రభుత్వ పాలనకు అవకాశం ఏర్పడింది. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు రాష్ట్రంలో మార్చి నుంచే అమలవుతున్నప్పటికీ.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల కోడ్‌లు రావడంతో ఆ ఫలాలు ఈ నెల నుంచే అందుతున్నాయి. ప్రస్తుతం విద్యుత్‌శాఖ అధికారులు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడిన వినియోగదారులకు జీరో బిల్లులు ఇస్తున్నారు. అలాగే వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుని, మొత్తం రుసుము చెల్లించిన తర్వాత రూ.500 పోను మిగతా సొమ్మును నగదు బదిలీ పథకం కింద వినియోగదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాల అమలుకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తేవడంతో చాలామందికి అర్హత ఉన్నా.. కేవలం రేషన్ కార్డు లేని కారణంగా లబ్ధి పొందలేకపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో ఎన్నికల హామీల అమల్లో భాగంగా.. ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం దరఖాస్తులను స్వీకరించింది. ఆరు పథకాలకు రేషన్‌కార్డు ఉండాలనే నిబంధన ఉండగా.. రేషన్‌కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆరింటిలో కొన్ని పథకాలను అమలు చేస్తున్నప్పటికీ.. రేషన్‌కార్డు లేని వారికి ఆ ఫలాలు అమలు కావడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అడపాదడపా మినహా కొత్త రేషన్‌కార్డులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదు. మీ సేవల ద్వారా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ.. రాష్ట్ర స్థాయిలోనే కొత్తవాటి మంజూరును నిలిపేసింది. దాంతో చాలామందికి అర్హత ఉన్నా.. కార్డులు రాలేదు. పథకాలు అమలు చేసే ముందు రేషన్‌కార్డులను మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఉమ్మడి కుటుంబం కార్డులే..

సాధారణంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఆహార భద్రత పథకం కింద రేషన్‌కార్డు ద్వారా ప్రతీ నెలా బియ్యం అందజేయాలి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చును భరిస్తాయి. రాష్ట్రం ఏర్పడక ముందు రేషన్ కార్డును ప్రభుత్వ పథకాల అమలుకు ఒక ప్రామాణికంగా తీసుకునేవారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌కార్డును కేవలం ఆహార భద్రత కోసమే పరిగణలోకి తీసుకుంది. సమగ్ర కుటుంబ సర్వేలో తీసుకున్న వివరాల ఆధారంగా పలు పథకాలను అమలు చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ రేషన్ కార్డునే పథకాలకు అర్హతగా తీసుకుంటోంది. ఏడేళ్లుగా రాష్ట్రంలో కార్డులు ఇవ్వకపోవడం వల్ల ఉమ్మడి కుటుంబం నుంచి వేరు పడిన వారు, కొత్తగా వివాహాలు చేసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. అటు రేషన్ బియ్యం అందక, ఇటు పథకాల లబ్ధి చేకూరక ఆందోళనకు గురవుతున్నారు. ఉదాహరణకు ఏడేళ్ల ముందు ఒక వ్యక్తి పేరు రేషన్ కార్డులో తన తల్లిదండ్రులతో నమోదై ఉందనుకుంటే.. తర్వాత వివాహం జరిగి, సంతానం కలిగినా.. ఇప్పటివరకు తన పేరు ఇంకా తల్లిదండ్రుల కార్డులోనే ఉంది. ఇప్పుడు ఒక రేషన్‌కార్డుకు ఒక లబ్ధిదారుడినే పరిగణలోకి తీసుకుంటున్న నేపథ్యంలో ఆ కార్డు యజమాని అయిన తల్లిదండ్రులకే ఆ ప్రయోజనం దక్కుతోంది. కుమారుడికి అన్ని అర్హతలు ఉన్నా రేషన్‌కార్డు లేని కారణంగా పథకాల ఫలాలు దక్కడం లేదు. ఇలా వివాహాలు చేసుకున్నవారు కోకొల్లలుగా ఉన్నారు. ఉదాహరణకు జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త రేషన్‌కార్డుల కోసం 12,477 దరఖాస్తులు వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్త దరఖాస్తులు 3200 దరఖాస్తులు రాగా, తల్లిదండ్రుల కార్డుల నుంచి మ్యూటేషన్ కోసం 9,400 దరఖాస్తులు వచ్చాయి.



రేషన్ దుకాణంలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు



కొత్త విధానం రూపకల్పన..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 9.34 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. అందులో ఆహారభద్రత పథకం కింద 8.66 లక్షల కార్డులు, అంత్యోదయ అన్నయోజన కింద 67,958 కార్డులు, అన్నపూర్ణ పథకం కింద 492 కార్డులు ఉన్నాయి. మొత్తం కార్డుల లబ్ధిదారుల సంఖ్య 31.01 లక్షలుగా ఉంది. వీరందరికీ ప్రతినెల 19,084.175 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతోంది. మారిన కొనుగోలు శక్తి ప్రకారంగా చాలామంది దొడ్డు రేషన్ బియ్యం తినడం లేదు. కేవలం పిండి వంటల కోసం మాత్రమే తీసుకుంటున్నారు. ఫలితంగా మిల్లర్లు, రేషన్ డీలర్లు కుమ్మక్కై, పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఈ పరిస్థితి మారి.. లబ్ధిదారులంతా రేషన్ బియ్యం తినాలంటే రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం సన్న బియ్యం ఇచ్చిన సమయంలో ఎక్కువమంది వినియోగించుకున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అనుసరిస్తామని చెబుతోంది. సన్న బియ్యం పంపిణీ వల్ల చాలా మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రధానంగా సీఎంఆర్ ఇవ్వక ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెడుతున్న మిల్లర్ల ఆటకట్టించవచ్చు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చే కందిపప్పు, పామాయిల్, గోధుమలు, ఉప్పు, మిర్చి పౌడర్, పసుపు, చింతపండును తర్వాత క్రమంలో నిలిపివేయగా, వాటిని కూడా ఈ ప్రభుత్వం తిరిగి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు పథకాలు అమలైతే చాలావరకు లబ్ధిదారులు ప్రజా పంపిణీ వ్యవస్థను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఈ కొత్త విధానాల రూపకల్పన కంటే ముందే నూతన రేషన్‌కార్డులను మంజూరు చేయాల్సి ఉంటుంది.



మండల మహిళా సమాఖ్య వద్ద చెనుగోనిపల్లి మహిళలు

మహిళా సంఘం నిధులు పక్కదారి

- ఐదేళ్లుగా లెక్కలు చెప్పని బుక్ కీపర్
- గద్వాల మండల సమాఖ్య వద్ద మహిళల నిరసన
- మా డబ్బులు ఇవ్వాలని ఏపీఎంతో వాగ్వాదం
- నాలుగు రోజుల్లో లెక్కలు చెబుతామని సమాధానం

గద్వాల, జూన్ 10: గద్వాల మండల పరిధిలోని చెనుగోనిపల్లి గ్రామంలో మహిళా సంఘాల నిధులు పక్కదారి పట్టాయి. ఐదేళ్లుగా లెక్కలు చెప్పకపోవడంతో మహిళా సంఘాల సభ్యులకు అనుమానం వచ్చింది. బుక్‌కీపర్ నర్సింహులును అడిగితే సీసీ రంగన్నను అడగండని చెప్పగా, ఆయన్ను అడిగితే బుక్‌కీపర్ మీదకు నెట్టడంతో మహిళల్లో అనుమానాలు పెరిగిపోయాయి. ఐదేళ్ల క్రితం రూ.15.80 లక్షల జమతో లెక్కలు చెప్పి, పాత కమిటీ దిగిపోయింది. ఇప్పుడు దాదాపు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఉండాలని మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారు. కానీ బ్యాంకులో అంతడబ్బు లేదని, పక్కదారి పట్టిందని ఆరోపిస్తూ సోమవారం 100 మందికి పైగా మహిళలు మండల మహిళా సమాఖ్యకు చేరుకున్నారు. ఈ విషయమై ఏపీఎం పారిజాతతో వాగ్వాదానికి దిగారు. తమ డబ్బులు తమకు ఇవ్వాలని ఆమె చాంబర్ ముందు కూర్చొని నిరసన తెలిపారు.

అనుమానాలు ఇవే..

ఐదేళ్ల క్రితం పాత కమిటీ రూ.15.80 లక్షలను కొత్త కమిటీకి అప్పగించింది. కొత్త కమిటీ ఇప్పటి వరకు లెక్కలు చెప్పలేదు. అదే విదంగా ఐదేళ్లుగా వానాకాలం, యాసంగిలో కొనుగోలు కేంద్రాల నిర్వాహణ ద్వారా రూ.12 లక్షల కమీషన్ వచ్చింది. వాటికీ లెక్కలు లేవు. అందులో నుంచి రూ.4.60 లక్షలు డ్రా చేశారని, వాటిని ఎందుకు ఖర్చు చేశారో చెప్పలేదని ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహణ కోసం అధికంగా ఖర్చయ్యిందని రాసి, డ్రా చేశారని సమాచారం. గ్రామంలో 40 చిన్న సంఘాలు ఉన్నాయి. దాంతో మరో గ్రామ సంఘాన్ని ఏర్పాటు చేయాలని అడుగగా ఒప్పుకోకపోవడం, ఉన్న గ్రామ సంఘానికి ఎన్నికలు నిర్వహించడానికి నిరాకరించడం, బుక్ కీపర్ పొంతనలేని సమాధానాలు, వింత వాదనలు వినిపిస్తుండటం, గత ఏపీఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో డబ్బులు పక్కదారి పట్టాయనడానికి బలం చేకూరుతోందని అంటున్నారు.



ఏపీఎంతో వాగ్వాదానికి దిగిన మహిళలు

ఏపీఎం హామీతో విరమణ

డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి ఏపీఎం పారిజాత వచ్చి నాలుగు రోజుల్లో లెక్కలు చెబుతామని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు. ఐదేళ్ల లెక్కలు చేస్తామని, ఒక్క రూపాయి కూడా మహిళల డబ్బులు పక్కదారి పట్టదనే గ్యారంటీ ఇవ్వడంతో శాంతించారు. ఈ విషయమై ఏపీఎం పారిజాతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గ్రామ సమాఖ్యలో మహిళా సంఘాల పొదుపులు రూ.8.56 లక్షలు, ధాన్యం కమీషన్ రూ.6 లక్షలు బ్యాంకులో ఉన్నాయన్నారు. మరో రూ.8.60 లక్షలు అప్పులు ఇచ్చారని తెలిపారు. మహిళలు అనుమానిస్తున్నట్లు పక్కదారి పట్టలేదని, బుక్‌కీపర్ లెక్కలు చెప్పకపోవడమే ప్రధాన సమస్య అని వివరించారు.


కమ్ముకున్న పొగమంచు

మన్ననూర్, జూన్10: నల్లమల అభయారణ్యాన్ని సోమవారం పొగ మంచు కమ్మేసింది. తెల్లవారుజామున ధారవాగు బేస్ క్యాంపు, గుండంవాగు, పర్హాబాద్, వ్యూపాయింట్, పిచ్చకుంట్లోని చెరువు, మల్లాపూర్ పెంటల పరిధిలో చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. దాంతో పాటు అడవి మొత్తం పొగమంచుతో కమ్ముకున్నది. శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వాహనదారులు లైట్లు వేసుకుని వాహనాలను నడిపారు అయినా దారి కనిపించక అసౌకర్యానికి గురయ్యారు. అడవిలో పొగమంచులో తడుస్తూ జింకలు, సాంబార్లు, మనుబోతులు, నీల్‌గాయ్, నెమళ్లు సంచరిస్తూ కనిపించాయి. మంచులో తడిసిన అడవి అందాలను చూసి పలువురు నేత్రానందం పొందారు. మే చివరి వారం నుంచి అమ్రాబాద్ అడవుల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి.



శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగమంచు





వ్యూపాయింట్ వద్ద ఊటీని తలపిస్తున్న మంచు, మంచుతో కనిపించని రోడ్డు



మంచులో కృష్ణ జింకలు



చెట్టుపై కూర్చున్న నెమలి

కృష్ణానదికి వరద

- సోమశిల వద్ద స్వల్పంగా పెరుగుతున్న నీటి మట్టం
- సంగమేశ్వర ఆలయం భీమలింగాన్ని తాకిన నీరు
- ఆనందంలో ఉమ్మడి జిల్లా ప్రజలు

కొల్లాపూర్, జూన్ 10: ఉమ్మడి పాలమూరు జిల్లాకు వరప్రదాయినీగా ఉన్న కృష్ణానదికి వరద జలాలు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జూరాల జలాశయానికి నీరు చేరడంతోపాటు తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో వరుసగా పడుతున్న వానలకు కృష్ణానదిలో నీటి మట్టం పెరుగుతోంది. గతేడాది కృష్ణానదికి ఆశించినంత మేర వరద జలాలు రాలేదు. దాంతో వేసవి ప్రారంభం నాటి నుంచే సాగు, తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సాగునీటి వసతి లేని చోట పంటలు వేయొద్దని ప్రభుత్వం రైతులకు చెప్పింది. తాగునీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఎంజీఎల్ఐ ద్వారా సాగునీటి సరఫరాను నిలిపివేశారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాతోపాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని నాలుగు వేల గ్రామాల ప్రజలకు తాగునీరు అందించేందుకు అధికారులు నానా అవస్థలు పడ్డారు.

వరద కొనసాగితే పెరుగనున్న పర్యాటకులు

ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలోనే కృష్ణానదికి వరద జలాల రాకతో రైతులు, ఉమ్మడి జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డెడ్ స్టోరేజీకి చేరిన జూరాలకు ఇప్పుడిప్పుడే వరద ప్రారంభమైంది. దాంతో తెలంగాణ, రాయలసీమ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న సప్తనదుల సంగమ క్షేత్రం సంగమేశ్వరాలయం సమీపానికి వరద జలాలు సోమవారం చేరాయి. నదిలో ఉన్న భీమలింగాన్ని వరద జలాలు తాకడంతో నీటి మట్టం పెరుగుతుందని రైతులు, మత్స్యకారులు సంబురపడుతున్నారు. ఈ ఏడాది నదికి ఆశించిన మేర వరద జలాలు చేరుతాయని ఆశిస్తున్నారు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రజలకు తాగునీటి కష్టాలు తీరుతాయని, ఎంజీఎల్ఐ ప్రాజెక్టు కింద సాగవుతున్న ప్రతీ ఎకరాకు నీరందుతుందని అనుకుంటున్నారు. కృష్ణానదికి వరద మరో 20 రోజుల్లో ఆశించిన మేర వస్తే ఈ ప్రాంత ప్రకృతి అందాలు, నది సోయగాలను తిలకించేందుకు, సోమశిల ప్రాంతంలో ఉన్న పురాతన ఆలయాలను దర్శించుకునేందుకు భక్తులు, పర్యాటకులు తరలిరానున్నారు.



సోమశిల వద్ద కృష్ణానదికి చేరిన వరద నీరు

జూరాలకు స్వల్పంగా..



జూరాలకు స్వల్పంగా వచ్చిన వరద నీరు

ధరూరు: స్థానికంగా కురుస్తున్న వర్షాలకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వరద స్వల్పంగా వచ్చి చేరుతోంది. ఎగువన ఉన్న ఆల్మట్టి జలాశయంలో 22.22 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయంలో 23.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్, యాద్గిరి, రాయిచూర్ తదితర ప్రాంతాల్లో స్థానికంగా కురిసిన వర్షాలకు జూరాలకు వరద వస్తోంది. ప్రస్తుతం జలాశయంలో 315.80 మీటర్ల మేర 4.936 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సుంకేసులకు 4,200 క్యూసెక్కులు

రాజోలి: రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి సోమవారం 4,200 క్యూసెక్కుల వరద వచ్చినట్లు ప్రాజెక్టు జేఈ రాజు తెలిపారు. జలాశయం నీటి సామర్థ్యం 1.20 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.507 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.

లక్ష్యం చేరలే..

- వనపర్తి జిల్లాలో పూర్తయిన ధాన్యం సేకరణ
- టార్గెట్ రెండు లక్షల మెట్రిక్ టన్నులు
- సేకరించింది 93,295 మెట్రిక్ టన్నులే..
- రైతుల ఖాతాల్లో రూ.200 కోట్లు జమ



ధాన్యాన్ని తూకం చేస్తున్న కార్మికులు

వనపర్తి అర్బన్, జూన్ 10: వనపర్తి జిల్లాలో ధాన్యం సేకరణలో అధికారులు లక్ష్యాన్ని చేరుకోలేదు. గత యాసంగిలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 93,295 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. అంటే 48 శాతమే చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 18,725 మంది రైతుల నుంచి 93,295 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇప్పటి వరకు 18,396 మంది రైతులకు రూ.200 కోట్లు ఖాతాలో జమ చేశారు. బహిరంగ మార్కెట్లో సన్న రకం ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కడంతో రైతులు ఎక్కువగా ప్రైవేట్ వ్యాపారులకే ధాన్యం విక్రయించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ జరుగలేదు. రెండు మూడు సీజన్లుగా అధికారుల లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 242 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 123, పీఏసీఎస్ పరిధిలో 116, మెప్మా పరిధిలో మూడు కేంద్రాలను నిర్వహించారు. అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు 93,295 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టింది. ఒకవైపు ఎన్నికలు కొనసాగుతున్నా.. మరోవైపు ధాన్యం సేకరణ చేపట్టారు.

వారం రోజుల్లో డబ్బులు జమ

ధాన్యం విక్రయించిన తర్వాత వారం రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.205 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, 18,725 మంది రైతులకు ఖాతాల్లో రూ.200 కోట్లు జమ చేశారు. ఇంకా 329 మంది రైతులకు రూ.ఐదు కోట్లు చెల్లించాల్సి ఉంది. వారికి కూడా వారం రోజుల్లో డబ్బులు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

వ్యాపారులకే అధికంగా విక్రయం

జిల్లాలో ఈ యాసంగిలో 83,308 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. దాదాపు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ధాన్యం ఉత్పత్తి ఆ మేరకు జరిగినప్పటికీ.. సేకరణ లక్ష్యాన్ని చేరుకోలేదు. సన్న రకం ధాన్యానికి బహిరంగ మార్కెట్లో క్వింటాలుకు రూ.2,300 నుంచి రూ.3,000 వరకు ధర పలికింది. ప్రభుత్వం మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ.2,206, బి గ్రేడ్‌కు రూ.2,186 చెల్లించింది. ధర ప్రైవేటులో ఎక్కువగా ఉండటంతో రైతులు వారికే ఎక్కువగా విక్రయించారు. కర్ణాటక వ్యాపారులు జిల్లాలోని ఆత్మకూరు, అమరచింత, మదనాపురం, కొత్తకోట, పెబ్బేరు, చిన్నంబావి, వీపనగండ్ల ప్రాంతాలలో కల్లాల దగ్గరికి వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేశారు.



ధాన్యాన్ని లారీలోకి ఎక్కిస్తున్న కార్మికులు

చినుకు పడిందా.. గోవిందా..

- అమావాస్య వస్తే కురుమూర్తి భక్తులకు తప్పని తిప్పలు
- చాలీచాలని షెడ్లతో అవస్థలు

చిన్నచింతకుంట, జూన్ 10 : తెలంగాణాలోనే పేదల తిరుపతిగా పేరొందిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి భక్తులకు అమావాస్య వచ్చిందంటే చాలు తిప్పలు తప్పటం లేదు. ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వారికి దాదాపు రూ.2 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతున్నా, స్వామి వారి భక్తులకు కష్టాలు తప్పటం లేదు. ప్రతీ అమావాస్యకు సుమారు 30 నుంచి 40 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తారు. అయితే రాత్రికి స్వామి సన్నిధిలోనే నిద్రపోతే మానసిక ప్రశాంతతతో పాటుగా అనారోగ్య సమస్యలు కూడా తొలగిపోతాయన్న నమ్మకంతో భక్తులు అమావాస్యరోజున జిల్లాలోనే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. అయితే భక్తుల రద్దీకి తగినంతగా వసతులు కల్పించటంలో దేవాదాయ అధికారులు పూర్తిగా అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. జాతర మైదానంలో చాలీచాలని షెడ్లు ఉండటంతో భక్తులకు ఏ మాత్రం సరిపోవటం లేదు. ప్రస్తుతం వర్షాకాలం ఉన్న నేపథ్యంలో భక్తులు రేకులషెడ్లల్లో ఉందామన్న అవి సరిపోవటం లేదు. దాంతో చాలా మంది భక్తులు జాతర మైదానంలోనే నిద్రిస్తున్నారు. ఆ సమయంలో వర్షం వస్తే, మొత్తం తడిసిముద్దయ్యే పరిస్థితిని ఎదుర్కొంటున్నామని భక్తులు వాపోతున్నారు. రాత్రి సమయంలో జాతర మైదానంలో భక్తులు హరికథలు, నాటికలు, బొడ్డెమ్మలు, పలకల కోళ్ల వంటి వాటి ప్రదర్శనలు తిలకిస్తారు. అయితే వీటిని ప్రదర్శించేందుకు తగిన సంబంధిత కళావేదిక వంటి మండపం లేని కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ వర్షం వస్తే, వీటిని తిలకించేందుకు వీలు లేకుండా పోతుందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత దేవాదాయ శాఖాధికారులు భక్తులకు వర్షం సమయంలో ఇబ్బందులు లేకుండా ఓ కళావేదిక భవనాన్ని, మరిన్ని షెడ్ల నిర్మాణాలను చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



కురుమూర్తిస్వామి ఆలయ ఆవరణలో రాత్రి సమయంలో సౌకర్యాలు లేక ఇక్కట్లు పడుతున్న భక్తులు (ఫైల్)

దాతల మీదే భారం వేస్తున్న వైనం

కురుమూర్తిస్వామి వారి దర్శనం చేసుకుందామని వచ్చిన భక్తులకు స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు తిప్పలు తప్పటం లేదు. చాలీచాలని గదులు, చినుకు పడిందంటే ఇక అంతేసంగతులు. ఎక్కడ గుడారం ఉంటే అక్కడే తలదాచుకునేందుకు పరుగులు తీయాల్సిందే. ఇక ఆలయ ప్రాంగణంలో వసతుల విషయానికొస్తే, ఇక్కడ గత ఎన్నో ఏళ్లుగా దాతల సహకారం పైనే అధికారులు ఆశలు పెట్టుకుంటున్నారు. అక్కడ ఏ అభివృద్ధి పనులు జరగాలన్నా, దాతలు ముందుకు వస్తే గాని పనులు కావన్న చందంగా మారింది. రూ.కోట్ల ఆదా యం వస్తున్నా అభివృద్ధి పనులకు నోచుకోవటం లేదనిభక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణం సుందరం.. బతుకు దుర్భరం

- ఇంటి నిర్మాణంలో 54 రకాల కార్మికులు
- ఉమ్మడి జిల్లాలో 9,718 దరఖాస్తులు పెండింగ్
- కార్మికులకు అందని ద్రాక్షలా సంక్షేమ పథకాలు
- అలసత్వం వహిస్తున్న అధికారులు

పాలమూరు, జూన్ 10 : సగటు మనిషి నుంచి సంపన్నుడి వరకు సొంతింటి నిర్మాణం చేసుకోవటమనేది కల. దానికి భూమి పూజ నుంచి మొదలుకొని ఇంజనీర్‌తో ప్లాన్, మేస్త్రీతో పాటు 54 రకాల కార్మికుల శ్రమతో నిర్మాణానికి అవసరమయ్యే వాటిని సమకూరిస్తేనే ఇల్లు తయారవుతుంది. అదే వారికి ఇంద్రభవనం, సొంతింటి కల, జీవితంలో ఇల్లు కట్టుకోవాలనే ఆశ తీరటం. సమాజంలో ఎలాంటి నిర్మాణమైనా తయారు కావాలంటే అసంఘటిత రంగంలో పనిచేసే నిర్మాణ కార్మికుల శ్రమ అవసరం. భవనాలు నిర్మించే కార్మికులకు సెస్ రూపేణా వచ్చిన నిధిని పథకాల రూపంలో పంచేందుకు అధికారులు అలసత్వం వహిస్తున్నారెందుకో..

భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుడు ప్రమాదవశాత్తు, సాధారణంగా మరణించినా ఆ కుటుంబమే వీధిన పడుతుంది. అందుకనే ప్రభుత్వం భవన నిర్మాణ, ఇతర రంగాల్లో పనిచేసే కార్మికులు, వారి కుటుంబాలను ఆదుకునేందుకు కార్మికశాఖ ఆధ్వర్యంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అయినప్పటికీ దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించనట్లు... కార్మికులకు ప్రభుత్వ సహకారం అందని ద్రాక్షలా మారింది. ఇల్లు కట్టుకునేటప్పుడు యజమాని ప్రభుత్వానికి ఒక్క శాతం సెస్ రూపేణా చెల్లిస్తున్నాడు. ఆ సెస్ ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.వెయ్యి కోట్లు ప్రభుత్వ ఖాతాలో జమ అయినట్లు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు సంక్షేమ చట్టం కావాలని ట్రేడ్ యూనియన్లు పోరాటం చేయటంతో 1996లో ప్రభుత్వం చట్టం చేసింది. సెస్ రూపేణా పోగైన డబ్బునే కార్మికులకు ఉపయోగించాల్సి ఉన్నప్పటికీ అధికారులు నేటికీ అనేక కొర్రీలు పెట్టి కార్మికులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుని వేధిస్తున్నారు. ఆ కారణంతో విసిగిపోయిన కార్మికులు పైరవీలు చేసుకున్నోళ్లకే లబ్ధి చేకూరుతుందనే అవగాహనకు వచ్చారు. ఒక ఇల్లు నిర్మాణం ప్రారంభం నుంచి గృహప్రవేశం వరకు తప్పనిసరిగా 54 రకాల కార్మికుల భాగస్వామ్యం అవసరం.

ఉమ్మడి జిల్లాలో 3,04,217 మంది కార్మికులకు రెన్యూవల్ చేసుకున్నది 1,72,246 మంది

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 3,04,217 మంది కార్మికులు నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారు. వారిలో మహబూబ్‌నగర్‌లో 89,162 మంది పనిచేస్తుండగా వీరిలో 39,844 మంది కార్మికులు రెన్యూవల్ చేసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 37,694 మందికి గాను 19,955 మంది రెన్యూవల్, వనపర్తి జిల్లాలో 47,998 మందికి గాను 24,995 మంది రెన్యూవల్, జోగుళాంబ గద్వాల జిల్లాలో 67,265 మందికి గాను 54,697 మంది రెన్యూవల్, నారాయణపేట జిల్లాలో 62,098 మందికి గాను 32,755 మంది కార్మికులతో మొత్తం 3,04,217 మందికి గాను 1,72,246 మంది కార్మికులు రెన్యూవల్ పూర్తి చేసుకున్నారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న



భవన నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికులు

కార్మికులు ఏడాదికి రూ.12లు చెల్లించి గుర్తింపు కార్డు పొంది, రెన్యూవల్ చేసుకుంటున్నారు. వారిలో సహజ మరణం, మ్యారేజ్, కాన్పు, వికలత్వం తదితర సమయాల్లో సంక్షేమ మండలి నుంచి సహాయం అందాలి. నేటికీ సుమారు అన్నిరకాల దరఖాస్తులు కలిపి మహబూబ్‌నగర్‌లో 7,783 దరఖాస్తులకు 2,562 దరఖాస్తులు పరిష్కారం కాగా, 5,051 పెండింగ్‌లో, 170 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. నాగర్‌కర్నూల్‌లో 2,907 దరఖాస్తులకు 498 పరిష్కారం, 2,349 పెండింగ్, 60 తిరస్కరణకు గురయ్యాయి. వనపర్తి జిల్లాలో 1,895, నారాయణపేట జిల్లాలో 1,710, జోగుళాంబ గద్వాల జిల్లాలో 3,050 దరఖాస్తులకు 962 పరిష్కారం కాగా, 1,126 పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం కలిపి 17,345మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 7,627 మంది మాత్రమే లబ్ధి పొందారు. నేటికీ 9,718 దరఖాస్తులను అధికారులు పెండింగ్‌లో పెట్టారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

పనిచేసేచోట కనీస సౌకర్యాలేవీ.?

నిర్మాణ రంగంలో పనిచేసే స్త్రీ, పురుష కార్మికులకు అడ్డాల్లో కనీస వసతులు కల్పించాలని చట్టం చెబుతోంది. ప్రధానంగా తాగునీరు, టాయిలెట్స్, బాత్‌రూమ్ లాంటివి తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంది. 99 శాతం పనిచేసేచోట నేటికీ కార్మికులకు కనీస వసతులు లేవు, స్కీంలను మార్చాల్సిన అవసరం ఉంది. సహజ మరణానికి రూ.90వేలు మాత్రమే ఉంది. అదే ప్రధానమంత్రి అకౌంట్ ద్వారా రూ.రెండు లక్షలు వస్తే నిర్మాణ కార్మికులకు రూ.90 వేలు కాకుండా రూ.ఐదు లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.10లక్షలు ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీంతోపాటు నిర్మాణ రంగంపై ఆధారపడిన కార్మికులందరికి నెలకు 26రోజుల పాటు పని కల్పించాలి. ఇక క్లెయిమ్స్ పరిష్కరించడంలో డీసీఎల్ తీరు సరిగ్గా లేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కింది స్థాయిలో ఏఎల్‌వో నుంచి డీసీఎల్ ద్వారా హైదరాబాద్‌కు పంపాల్సి ఉంది. డీసీఎల్ కార్యాలయానికి కార్మికులు తిరిగి విసిగిపోతున్నట్లు చెబుతున్నారు.

క్లెయిమ్స్ పరిష్కరించటంలో డీసీఎల్ అలసత్వం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వచ్చిన క్లెయిమ్స్‌ను డీసీఎల్ పరిశీలించి హెడ్ ఆఫీసుకు పంపాలి. నెలకోసారి బోర్డు మీటింగ్ పెట్టి అందులోనే తుది జాబితాను పంపాల్సి ఉండగా ఆ పని డీసీఎల్ చేయటం మానేశారు. అవసరం లేకపోయినా లబ్ధిదారులు వీడియో కాల్‌చేసి మాట్లాడమని డీసీఎల్ అడగటం సరికాదు.

- సి.వెంకటేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు

పని ఒత్తిడితోనే చేయలేకపోతున్నాం..

ఆఫీసులో సిబ్బంది తక్కువ ఉన్నారు. పని ఒత్తిడి అధికమవటంతోనే పనిచేయలేకపోతున్నాం. కార్మికులకు సంబంధించిన క్లెయిమ్స్ పరిష్కరించాలని మాకు ఉంటుంది. కానీ పరిస్థితులు అనుకూలించటం లేదు. అవగాహన లేకుండా కార్మికులు దరఖాస్తు చేసుకోవటంతోనే సమస్యలు వస్తున్నాయి.

- చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎల్ మహబూబ్‌నగర్

జిల్లాల వారీగా కార్మిక కుటుంబాలు, పొందిన సహాయం వివరాలు (1-ఏప్రిల్-2023నుంచి 3-మార్చి-2024వరకు)

జిల్లా	లబ్దిదారులు	ప్రసవ సహాయం	పెళ్లికానుక	సాధారణ మరణం	ప్రమాద మరణం	శాశ్వత వైకల్యం	అందిన సహాయం (రూ.లక్షల్లో.)
మహబూబ్‌నగర్	2562	1668	599	245	47	03	12,96,83,518
నాగర్‌కర్నూల్	498	329	101	64	04	00	1,36,38,398
వనపర్తి	1895	1119	512	227	31	06	9,95,57,510
జోగులాంబగద్వాల	962	598	312	40	12	00	4,00,96,556
నారాయణపేట	1710	1111	408	181	09	01	7,53,34,980
మొత్తం				అందిన సహాయం రూపాయలు			35,83,10,962/-

నిజాయతీ చాటుకున్న 108 సిబ్బంది

బిజినేపల్లి, జూన్ 10 : బాధితుడి వద్ద ఉన్న బంగారం, నగదును కుటుంబ సభ్యులకు అందజేసిన 108 సిబ్బంది నిజాయతీని డాక్టర్లు, పోలీసులు, ప్రజలు అభినందించారు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం సాయంత్రం చింతకాల పెంటయ్య అనే వ్యక్తి ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలోకి పోయాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వెంటనే బాధితుడికి ప్రథమచికిత్స అందించి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే, గంగారం గ్రామానికి చెందిన పెంటయ్య ఫిట్స్‌తో స్పృహ కోల్పోయి కింద పడిపోయినప్పుడు అతని వద్ద రెండు తులాల బంగారం, రూ.రెండు వేల నగదు ఉంది. గమనించిన 108 సిబ్బంది వాటిని డ్యూటీ డాక్టర్, పోలీసుల సమక్షంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. విషయం తెలిసిన పలువురు 108 పైలెట్ జహంగీర్, శివకుమార్‌ల నిజాయతీని అభినందించారు.



బాధితుడి కుటుంబ సభ్యుడికి నగదు, బంగారు అందజేస్తున్న 108 సిబ్బంది

సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

మదనాపురం, జూన్ 10 : వనపర్తి జిల్లా మదనాపురం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొండ శ్రీనివాసులును కలెక్టర్ తేజస్ నందలాల్ సస్పెండ్ చేశారు. రెండువారాల క్రితం ఓ మండల ప్రజాప్రతినిధికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. దీనిపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అతడు పెట్టిన పోస్టు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించాడని పేర్కొంటూ కలెక్టర్ సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కురుమూర్తి రాయా కరుణించవా

- మూత పడ్డ కురుమూర్తిరాయ లిఫ్టు
- గత సంవత్సరం నీళ్లున్నా వదలని పరిస్థితి
- ఆయకట్టు కింద రెండు వేల ఎకరాల సాగు



కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకం

మదనాపురం, జూన్ 10 : మండలంలోని కొత్తపల్లి, దుప్పల్లి, చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం, కురుమూర్తి గ్రామాలకు సాగునీరు అందించేందుకు కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. దీని కింద సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ లిఫ్టును 2003 సంవత్సరంలో సుమారు రూ.12 కోట్ల వ్యయంతో రామన్‌పాడు బ్యాక్‌వాటర్ ఉన్న కొత్తపల్లి గ్రామ సమీపంలో స్థాపించారు. లిఫ్టు సౌకర్యం అయినప్పటి నుంచి సవ్యంగా సాగేది. రైతులు ఈ పంట శిస్తును సకాలంలో చెల్లించి లిఫ్టు అభివృద్ధికి తోడ్పడేవారు. దీని వలన కమిటీకీ ఆదాయం బాగా వచ్చేది. రానురాను లిఫ్టు కమిటీలో రాజకీయ జోక్యం పెరగడంతో లిఫ్టు నడవడం నెమ్మదించింది. దీంతో రైతులు కూడా శిస్తులు సక్రమంగా కట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు. ఏదైనా మరమ్మతు వచ్చినప్పుడు లిఫ్టు కమిటీలో డబ్బు ఉండడంతో వెంటనే మరమ్మతు చేసేవారు. గత సంవత్సరం వర్షాలు ఆలస్యంగా రావడంతో రామన్‌పాడు ప్రాజెక్టుకు నీరు కూడా ఆలస్యంగా వచ్చింది. చాలామంది రైతులు నీటిని విడుదల చేయాలని చెప్పినా వదలకపోవడంతో పంటలను వేయలేకపోయారు. కనీసం ఈ సంవత్సరమైనా డ్యాంలు నిండే నాటికి మరమ్మతు చేస్తే నీరు వచ్చిన వెంటనే లిఫ్టును ప్రారంభించడానికి వీలుంటుంది. కానీ కనీసం లిఫ్టు పంప్‌హౌస్ మొఖం కూడా ఇంతవరకు చూడకపోవడం ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి రాజకీయ పార్టీల నాయకులే కారణమని మరికొంతమంది తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న కమిటీని రద్దు చేసి నూతన కమిటీని వేయాలని కొందరు ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప రైతాంగానికి సాగునీటిని ఎలా అందించాలనే దాని మీద దృష్టి పెట్టకపోవడం బాధాకరం. ఈ మధ్యనే స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి లిఫ్టును పరిశీలించి మరమ్మతులు చేయాలని ఆదేశించినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇదిలా ఉంటే కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకం కనుమరుగయ్యే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



లిఫ్టు కింద నాట్లు వేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆయకట్టుకు నీరు అందించాలి



కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకం కింద నాకు రెండు ఎకరాలు ఉంది. గత సంవత్సరం నీరు వదలకపోవడంతో ఎలాంటి పంటలు వేయలేదు. ప్రస్తుతం లిఫ్టుకు ఏదైనా మరమ్మతులు ఉంటే చేయాలి. రామన్‌పాడు ప్రాజెక్టుకు నీరు వచ్చిన వెంటనే లిఫ్టును ప్రారంభించవచ్చు.

- మండ్ల రాములు, రైతు

లిఫ్టుకు మరమ్మతులు చేయాలి



లిఫ్టుకు ఏమైనా రిపేర్లు ఉంటే వెంటనే మరమ్మతు చేయాలి. లిఫ్టు కింద నాలుగు గ్రామాల రైతులు ఆధారపడి బతుకుతున్నాం. పోయిన సారే నీళ్లు వదలకపోవడంతో నష్టపోయాం. ఈసారైనా డ్యాంలో నీళ్లు వచ్చిన వెంటనే వదిలేటట్లు చూడాలి.

- భూపని వెంకటయ్య, రైతు

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు

బల్మూరు, జూన్ 10 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల కేంద్రంలో సోమవారం బొడ్రాయి ఉత్సవాలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన గ్రామస్థులు బొడ్రాయికి నీళ్ల పారాయణం, పోచమ్మకు మొక్కుబడులు సమర్పించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.



బల్మూరులో నిర్వహించిన బొడ్రాయి ఉత్సవాల్లో బోనం ఎత్తుకున్న మహిళలు

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

ఊర్కొండ : మండలంలోని ఊర్కొండపేట గ్రామంలో బొడ్రాయి పునః ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గ్రామ దేవతలకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ దేవతలకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌గౌడ్ , అంజయ్యగౌడ్, అబ్దుల్ సమి, వహీద్, శేఖర్‌రెడ్డి, శ్రీశైలం, మన్సూర్, రాజేష్, అశోక్, రవీందర్‌సాగర్, ఆంజనేయులు, మల్లేష్ పండితులు దత్తాత్రేయశర్మ, శ్రీనివాసశర్మ తదితరులున్నారు.

బాలికపై అత్యాచారం, కేసు నమోదు

కేటీదొడ్డి/ గద్వాల క్రైం, జూన్ 10 : జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. అంతకుముందు బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలో డీఎస్పీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. తనపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేటీదొడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన కొండన్న అనే వ్యక్తి కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆమె తన తండ్రికి చెప్పడంతో ఆయన కొండన్నను మందలించాడు. అయినా అతడు తన పద్ధతిని మార్చుకోలేదు. ఇటీవల ఆమె తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇదే అదునుగా భావించిన కొండన్న గత నెల 29న అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయంపై మరుసటి రోజు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఫిర్యాదు తీసుకోలేదని, రాజీ కావాలని ఒత్తిడి చేశారని బాధితురాలు తెలిపింది. ఈ మేరకు వారు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. అత్యాచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు కేటీదొడ్డి ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. అయితే ఆధార్ కార్డులో ఆమె మేజర్ అని, బోనఫైడ్‌లో మైనర్ అని ఉందని అన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి విచారణ చేపడతామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

తిమ్మాజిపేట, జూన్ 10 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పుల్లగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని బండమీదితండాకు చెందిన మూడావత్ శంకర్ నాయక్(35) అదృశ్యమయ్యాడు. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూడావత్ శంకర్‌నాయక్ హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. తండాలో అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చూడడానికి వచ్చి తిరిగి గత నెల ఆరో తేదీన హైదరాబాద్‌కు వెళ్లాడు. కాగా, అదేనెల 31న తల్లి చనిపోయిందని తమ్ముడు సురేష్ సమాచారమివ్వగా రాలేదని, అనుమానంతో చుట్టుపక్కల, బంధువులకు సమాచారమిచ్చినా ఆచూకీ తెలియలేదన్నారు. దీంతో సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై కోతులు దాడి

నవాబ్‌పేట, జూన్ 10 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కొత్తపల్లి గ్రామంలో సోమవారం ఓ బాలికపై కోతులు దాడి చేశాయి. దీంతో బాలికను తల్లిదండ్రులు నవాబ్‌పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయించారు. బాలిక తల్లిదండ్రులు మాట్లాడుతూ గ్రామంలో నిత్యం కోతులు ఆహారం కోసం ఇళ్లల్లోకి చొరబడి ప్రజలను కరుస్తు దాడులు చేస్తున్నాయని వాపోయారు. పంచాయతీ, అటవీశాఖ అధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

భూత్పూర్, జూన్ 10 : విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కర్వెన గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లారెడ్డి తన వ్యవసాయ పంట పొలం వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మేత మేస్తున్న కాడెద్దు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.65వేలు ఉంటుందని, విద్యుత్ అధికారులు కాడెద్దు మృతికి నష్ట పరిహారం ఇవ్వాలని మల్లారెడ్డి ప్రభుత్వాన్ని కోరాడు.

ఈదమ్మబండ తండాలో మేకపోతు మృతి

వెల్దండ : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం ఈదమ్మబండతండాలో సోమవారం విద్యుదాఘాతంతో మేకపోతు మృతి చెందింది. తండాలో ఛత్రునాయక్ అనే రైతుకు చెందిన మేకపోతు సోమవారం వ్యవసాయ పొలంవద్దనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మేకపోతు విలువ రూ.10 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

లోకిరేవు గ్రామ రహదారి సమీపంలో గొర్రెలు మృతి

నవాబ్‌పేట : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రం సమీపంలోని లోకిరేవు గ్రామ రహదారి సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి ఆరు గొర్రెలు మృతి చెందాయి. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని గొల్ల శివ తనకున్న గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. గ్రామ సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ రైతు విద్యుత్ కనెక్షన్ కోసం స్తంభం నుంచి లైన్ తీసుకొని వైరును వదిలివేశాడు. ఈ క్రమంలో అవుసుల శేఖరయ్య పొలంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు కంచెను తాకాయి. గొర్రెలు మేత మేస్తూ కంచెను దాటే క్రమంలో దానిని తాకడంతో ఆరు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, ఐదు గొర్రెలు గాయాలపాలయ్యాయని గొల్ల శివ వాపోయాడు.

ఊర కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

కోడేరు, జూన్ 10 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి గ్రామంలో ఊరకుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృతి చెందాయి. బాధిత రైతు లేవిని కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తనకున్న గొర్రెలను మేతకు తీసుకెళ్తూ 14 గొర్రె పిల్లలను మంద వద్ద ఇనుప కంచె వేసి ఉంచినట్లు తెలిపాడు. తాను వెళ్లిన తర్వాత ఊరకుక్కలు మంద వద్దకు వచ్చి గొర్రెపిల్లలపై దాడి చేశాయన్నారు. దాడిలో ఐదు గొర్రె పిల్లలు పూర్తిగా చనిపోగా, మూడు గొర్రె పిల్లలకు తీవ్ర గాయాలై చనిపోయే పరిస్థితిలో ఉన్నాయని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

గొర్రె పొట్టేళ్లు చోరీ

భూత్పూర్, జూన్ 10 : మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్త మొల్గర గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలం వద్దనున్న షెడ్డులో పెంచుకుంటున్న 28 గొర్రె పొట్టేళ్లు చోరీకి గురయ్యాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తమొల్గర గ్రామానికి చెందిన గొల్లబాలయ్య, మలిశెట్టి వెంకటయ్య, గట్టు వెంకటయ్య, లింగాల వెంకటయ్యలు గ్రామ శివారులో ఉన్న గొల్ల బాలయ్య వ్యవసాయ పొలం వద్ద ఉన్న అదే గ్రామానికి చెందిన ఆర్.చిన్నయ్య షెడ్డులో వంద గొర్రె పొట్టేళ్లను పెంచుకుంటున్నారు. ఈనెల తొమ్మిదో తేదీ రాత్రి గుర్తు తెలియని దొంగలు 28 గొర్రె పొట్టేళ్లను దొంగిలించుకెళ్లారు. మరుసటి రోజు గమనించిన బాధితులు చోరీకి గురైన పొట్టేళ్ల కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. లాభం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో అదే ప్రాంతంలో గొల్లబాలయ్యకు చెందిన పత్తి పంటను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అదేవిధంగా వ్యవసాయానికి సంబంధించిన చొప్ప కత్తిరించే మిషన్, వ్యవసాయ పనిముట్లు పలుమార్లు చోరీకి గురైనట్లు బాధితులు ఆరోపించారు. చోరీకి గురైన గొర్రె పొట్టేళ్ల విలువ సుమారు రూ.మూడు లక్షల 30 వేలు ఉంటాయని బాధితులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ల పట్టివేత

రాజాపూర్, జూన్ 10 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తయారు చేస్తున్న రెండు ట్రాక్టర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మల్లేపల్లి రోడ్డులోని ఉన్న దుందుభి వాగు నుంచి ఆదివారం రాత్రి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. ఇసుకకు సంబంధించి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గురుకులంలో పాము పట్టివేత

కొత్తకోట, జూన్ 10 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అమడబాకుల గ్రామ శివారులోని వీపనగండ్ల ఎస్సీ గురుకుల పాఠశాలలోకి సోమవారం నాగు పాము వచ్చింది. రెండురోజుల్లో పాఠశాల ప్రారంభం సందర్భంగా సిబ్బంది గదులను శుభ్రం చేస్తుండగా నాగుపాము కనిపించింది. ప్రిన్సిపాల్ దయాకర్ సమాచారంతో కృష్ణసాగర్ గురుకుల పాఠశాలకు చేరుకొని గదిలోని పామును బయటకు తీసుకొచ్చారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప ఉత్సవాలు



బీరప్ప ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

చిన్నంబావి, జూన్ 10 : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం మియాపూర్ గ్రామంలో చెన్నుపాడు బీరప్ప, ఎల్లమ్మ ఉత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బీరప్పకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బండారితో ప్రత్యేకంగా ఎల్లమ్మతల్లిని అలంకరించారు. తొమ్మిది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ పండుగకు మండలంలోని పలు గ్రామాల్లోని కురుమ సోదరులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల మల్లయ్య, గోపాల దేవేందర్, ఓడే పరశురాముడు, ఓడే ఆంజనేయులు, బీరయ్య తదితరులున్నారు.

నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి

- పీసీసీ మాజీ సభ్యుడు బండారు శ్రీనివాస్‌గౌడ్



మల్లు రవిని సన్మానిస్తున్న పీసీసీ మాజీ సభ్యుడు బండారు శ్రీనివాస్‌గౌడ్

వనపర్తి టౌన్, జూన్ 10: ఎంపీ మల్లురవి కృషితో నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పీసీసీ మాజీ సభ్యుడు బండారు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇటీవల ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించిన మల్లు రవిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌమ్యుడిగా పేరున్న డాక్టర్ మల్లు రవి గెలుపు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంటులో బలమైన ప్రతిపక్షంగా ఇండియా కూటమి ఉండటంతో ప్రజల పక్షాన తన గళాన్ని వినిపిస్తాడని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ బ్రహ్మయ్యచారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు ప్రారంభించాలి

- కలెక్టర్‌ను కోరిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 10 : వనపర్తి నియోజకవర్గంలో గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణం కోసం రూ.5 కోట్లు మొదటి విడత, రూ. 32 కోట్లు రెండో విడతగా నిధులు మంజూరై ఉన్నాయని వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. అగ్రికల్చర్ కాలేజీ నిర్మాణం కోసం రూ.కోటి 50 లక్షలు మంజూరై ఉన్నాయని అన్నారు. వనపర్తి, పెబ్బేరు రోడ్డు తొమ్మిది కిలో మీటర్ల మేర పనులు ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. ఇలా జిల్లాలో గతంలో నిధులు మంజూరై నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జడ్పీటీసీ సభ్యులు పద్మ, రఘుపతిరెడ్డి, ఎంపీపీలు శ్రీధర్ రెడ్డి, సేనాపతి, పెబ్బేరు మునిసిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రావులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆల



రావులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం, జూన్ 10: మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డికి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన జన్మదినం సందర్భంగా హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో బీఆర్‌ఎస్ మండల నాయకులతో కలిసి రావులను సన్మానించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రావణ్ కుమార్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షులు రాజ్‌కుమార్, దుప్పల్లి గ్రామ మాజీ సర్పంచు శివశంకర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణేష్



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

వనపర్తి టౌన్, జూన్ 10: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎనిమిది నెలలుగా గ్రామ పంచాయతీ వర్కర్లకు వేతనాలు చెల్లించకపోతే కార్మికుల జీవనం ఎలా సాగుతుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసి గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, లేని యెడల వర్షాకాలంలో మరోసారి ఆందోళన బాట పట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. అదేవిధంగా మల్టీపర్పస్ విధానం రద్దు చేసి గ్రామ పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏదుట్ల కురుమయ్య, ఉపాధ్యక్షుడు సుబ్బయ్య, గట్టమ్మ, బొజ్జన్న, పెంటయ్య, రామచంద్రయ్య రాములు, భాస్కాచారి, స్వామి, చెంద్రయ్య, నాగమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు



సివిల్ సప్లై అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

వనపర్తి టౌన్, జూన్ 10: తెలంగాణ పౌరసరఫరాల సంస్థ, జీసీసీ హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ నాగేశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లై, జీసీసీ హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, గత వేతన ఒప్పందంలో అంగీకరించిన ఈఎస్‌ఐ సౌకర్యాన్ని అమలు చేయాలన్నారు. 60 సంవత్సరాలు పైబడిన హమాలీకార్మికులకు రిటైర్డ్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వడంతో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నందిమల్ల రాములు, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు జి కురుమయ్య డి కురుమయ్య తదితరులు ఉన్నారు.

చిన్నారెడ్డి నివాసంలో జన్మదిన వేడుకలు

వనపర్తి టౌన్, జూన్ 10: రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండీ బాబా జన్మదిన వేడుకలు ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. సోమవారం చిన్నారెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఓబీసీ జిల్లా చైర్మన్ కోట్ల రవి, చీర్ల జనార్దన్, జిల్లెల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన అధికారులు

పాన్‌గల్, జూన్ 10 : మండలంలోని మహమ్మదాపూర్ నుంచి కంబాలపూర్ వరకు నిలిచిపోయిన రోడ్డు పనులను సోమవారం పంచాయతీరాజ్ అధికారులు ఈఎన్‌సీ కనకరత్నం, ఎస్ఈ రామ్మోహన్‌రావులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చేపట్టిన పనులను సమీపంలోని రైతులు పరిహారం చెల్లించాలని హైకోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిపివేశామని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణం చేపడుతామని తెలిపారు.

ప్రజావాణి పనితీరు బాగుంది

- జిల్లాలో ప్రజావాణి చాలా క్రమ పద్ధతిలో జరుగుతుంది
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ, అధికారుల పనితీరును పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 10: జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం పనితీరు బాగుందని చేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రశంసించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని చిన్నారెడ్డి పరిశీలించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగే రాష్ట్ర ప్రజావాణి విభాగానికి ఇన్‌చార్జి అయిన ఆయన జిల్లాలో ప్రజావాణి ఏ విధంగా జరుగుతుందని కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు ఎలా తీసుకుంటున్నారు. వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను గమనించారు. వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్, అదనపు కలెక్టర్ పరిశీలించి అక్కడే ఉన్న అధికారులకు, వెబ్ కాన్ఫరెన్స్‌లో ఉన్న మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం, కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేయడం చూసి చిన్నారెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్, వారి యంత్రాంగం చిత్తశుద్ధితో చేస్తున్న పనితీరు బాగుందని అన్నారు. హైదరాబాద్‌లో సైతం రేపటి నుంచి ఈ పద్ధతిని అనుసరిస్తామని చెప్పారు. తక్షణం పరిష్కరించాల్సిన ఫిర్యాదులను నేరుగా తనకు పంపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం చేపట్టాలని ప్రభుత్వ పాఠశాలల్లో మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు కట్టి పండుగ వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. వాటిని పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బందిని నియమించడంపై రాష్ట్ర స్థాయిలో ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి కావలసిన విత్తనాలు, ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశ పెట్టే ప్రతీ కార్యక్రమాన్ని ప్రజలకు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. అంతకుముందు ఆయన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని సాధారంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 70 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పదిలో ద్విభాషా పుస్తకాలు

- ప్రతీ పుస్తకం రెండు విభాగాలుగా విభజన
- జూన్ నుంచి అక్టోబరు వరకు మొదటి పార్టు
- నవంబరు నుంచి మార్చి వరకు రెండో విభాగం
- విద్యార్థులకు తగ్గనున్న పుస్తకాల బరువు

వనపర్తి రూరల్, జూన్ 10: ఈ ఏడాది నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ద్విభాషా పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. ఈ నెల 12 పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వనపర్తి జిల్లాలో 555 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా పీఎస్‌లు 361, యూపీఎస్‌లు 58, హై స్కూల్స్ 136 ఉన్నాయి. పదో తరగతి చదివే విద్యార్థులు 7,126 మంది ఉన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు పుస్తకాలు చేరవేశారు. గతేడాది 9వ తరగతి వరకు మాత్రమే ద్విభాషా (తెలుగు, ఆంగ్ల భాషా)లో ప్రచురితమైన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు కూడా పుస్తకాల మోత భారం తగ్గించేందుకు ద్విభాషా పుస్తకాలు అందించనున్నారు. ప్రతీ పుస్తకంలో ఆంగ్లం, తెలుగులో ముద్రించడంతో పాటు విద్యార్థులకు పుస్తకాల బరువు పెరగకుండా రెండు విభాగాలలో విభజించారు. జూన్ నుంచి అక్టోబరు మాసం వరకు పార్ట్ వన్ పుస్తకాలు, నవంబరు నుంచి మార్చి మాసంలో పార్ట్ 2 పుస్తకాల సిలబస్ బోధిస్తారు. తద్వారా ద్విభాషా పాఠ్యపుస్తకాల వల్ల విద్యార్థులు సులభవంతంగా నేర్చుకునేందుకు వీలుంటుందని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. పేజీలోనే పాఠం పూర్తి వివరాల కోసం సంబంధిత వీడియో కోసం అక్కడ క్యూఆర్ కోడ్‌ను ఉంచారు. మొబైల్‌తో స్కాన్ చేస్తే వీడియోలతో పాటు ఫొటోలు వచ్చేలా ఏర్పాటు చేశారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు (ఫైల్)

ఫస్ట్ టైం పదవ తరగతి విద్యార్థులకు ద్విభాషా పుస్తకాలు



ఇదివరకు తొమ్మిదో తరగతి విద్యార్థులకు ద్విభాషా పుస్తకాలు అందించాం. ఈ ఏడాది ఫస్ట్‌టైం 10వ తరగతి విద్యార్థుకు తెలుగు, ఆంగ్లం మాధ్యమాల పుస్తకాలు అందిస్తున్నాం. ఇప్పటికే ముద్రణ కూడా పూర్తయింది. రేపే పాఠశాలల పునఃప్రారంభం రోజు పుస్తకాల పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాము.

- గోవిందరాజులు, డీఈవో

వెంచర్లలోని 10 శాతం భూమి స్వాహా

- పుట్టగొడుగుల్లా వెలిసిన అక్రమ వెంచర్లు
- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు గౌడ్
- ఆత్మకూరు మునిసిపల్ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ నిరసన



మునిసిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు, జూన్ 10: అధికార దాహంతో ఆత్మకూరు మునిసిపల్ పాలక మండలి సహకారంతో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి అందులోని 10 శాతం ల్యాండ్‌ను స్వాహా చేశారని కాంగ్రెస్ పార్టీ అత్మకూరు పట్టణ నాయకులు సోమవారం మునిసిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్ మాట్లాడుతూ.. గతంలో బీఆర్‌ఎస్ హయాంలో పట్టణ పరిసర ప్రాంతాలలో అక్రమ వెంచర్లకు అనుమతులు ఇవ్వడమే కాకుండా ఆ వెంచర్లలో 10శాతం ల్యాండ్ ప్రభుత్వ ఆధీనం లోకి రావాల్సి ఉండగా వాటికి కూడా అసెస్మెంట్ నంబర్లు ఇస్తు అక్రమంగా కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. పట్టణ కేంద్రంలోని శ్రీ జగదీశ్వర కాలనీ, వెంకట్‌రెడ్డి కాలనీ తదితర కాలనీలలో ప్లాట్లను అదనంగా సృష్టించి ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారని ఆరోపించారు. అలాగే సర్వే నంబరు 517, 518 ప్రభుత్వ భూమిలో ఎకరా 14 గుంటల భూమిని బినామీలకు విక్రయించారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబరు 116లోని మార్కెట్ యార్డు ఎదురుగా చేసిన వెంచర్లో 10 శాతం భూమి హక్కు పత్రాలు బినామీ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. మునిసిపల్‌కు రావాల్సిన 10 శాతం ల్యాండ్‌ను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదును అందజేశారు. ఈ విషయం పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కలెక్టర్, మునిసిపల్ శాఖ మంత్రి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిలకు వినతిపత్రాలను అందజేస్తు సమస్యను పరిష్కరించే వరకు ధర్నాలు రాస్తారోకోలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పరమేష్, శ్రీనివాసులు, తులసిరాజ్, గంగాధర్‌గౌడ్, వెంకట నరసింహరావు, మణివర్ధన్ రెడ్డి, నాగేష్, రవీందర్, శ్రీనివాసులు, మధు, లక్ష్మణ, భగవంతు ఉన్నారు.

ఘనంగా సినీ నటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలు



ఆత్మకూరు పట్టణంలో కేక్‌కట్ చేస్తున్న ఎన్‌బీకే అభిమాన సంఘం నాయకులు

వనపర్తి టౌన్, జూన్ 10: సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఆయన ఫ్యాన్స్ ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఎన్‌బీకే ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కేంద్రంలోని చింతల ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చేయూత అనాథ ఆశ్రమంలో చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌బీకే అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు కోమారి దస్తగిరి, ప్రధాన కార్యదర్శి ద్యారపోగు బాలరాజు, అశ్విని రమేష్, పుల్లూరు విశ్వనాథం, నాగులు, మోహన్ సాగర్, గంధం రవి, నాగరాజాచారి పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : ప్రముఖ సినీ నటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఆత్మకూరు పట్టణ కేంద్రంలో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామారావు విగ్రహం ముందు సోమవారం బాలకృష్ణ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌బీకే అభిమాన సంఘం నాయకులు ఎస్‌టీడీ శ్రీనివాసులు, ఆత్మకూరు మాజీ సర్పంచ్ కట్టెల మండి రాములు, తిరుపతయ్య గౌడ్, రవికుమార్ పాషా, కొత్తూరు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామచంద్రరావు

-వనపర్తి వైద్యవిభాగం, జూన్ 10: జిల్లాలో ఏఎన్‌ఎంలు వారికి నిర్దేశించిన లక్ష్యం ప్రకారం 30 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరికీ అసంక్రమిత వ్యాధులపై స్క్రీనింగ్ నిర్వహించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ రామచంద్రరావు ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వైద్య, ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో పెబ్బేరు పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎన్‌సీడీ స్క్రీనింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తించిన వారందరికీ స్క్రీనింగ్ నిర్వహించడంతో పాటు అభా కార్డులు జనరేట్ చేయాలని అన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు వారి పరిధిలోని ఎన్‌సీడీ మందులు వాడుతున్న అందరినీ ప్రతీ నెల ట్రీట్‌మెంట్ అందించాలని ఆదేశించారు. పీహెచ్‌సీ పరిధిలో ప్రతీ నెల 10 శాతం జనాభాను లక్ష్యంగా పెట్టుకుని స్క్రీనింగ్ చేయాలన్నారు. అనంతరం ఓరియంటేషన్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్ కొండ, సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ఖిల్లాఘణపురం, జూన్10: బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఎంఈవో ఉషారాణి తెలిపారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేసే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈవో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతీ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లోని సదుపాయాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రాములు, వెంకటేష్, పార్వతమ్మ, ఎమ్మార్సీ సిబ్బంది, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే మెరుగైన బోధన

పెబ్బేరు : సర్కారు బడుల్లోనే విద్యార్థులకు మెరుగైన బోధన ఉంటుందని ఎంఈవో జయరాములు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం పెబ్బేరు పట్టణంలో ఇంటికి వెళ్లి మీ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రైవేటుకు దీటుగా...

పాన్‌గల్ : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన అందుతుందని హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని వెంగళాయిపల్లి, చిక్కేపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు.

'సకాలంలో దుస్తులు అందించాలి'

పెద్దమందడి, జూన్ 10: పాఠశాల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేయాలని మహిళా సంఘం సభ్యులకు ఏపీడీ భీమయ్య సూచించారు. సోమవారం ఏకరూప దుస్తులను కుడుతున్న కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థుల కొలతలకు సరిపోయే విధంగా నాణ్యతతగా కుట్టు ఉండాలని సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభంలోపు పాఠశాలలకు దుస్తులు పంపిణీ చేస్తే ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేస్తారన్నారు. ఆయన వెంట ఏపీఎం నాగమణి, మహిళా సంఘ సభ్యులు ఉన్నారు.

అందుబాటులో విత్తనాలు

పెద్దమందడి, జూన్ 10: వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో వరి ఆర్ఎన్ఆర్-50 బస్తాలు ఉన్నాయని, 25 కేజీల బస్తా ధర రూ. 1097, 10-10 ఎంటీయూ 60 బస్తాలు ఉన్నాయని, ఒక బస్తా ధర రూ. 995 ఉంటుందని తెలిపారు. బీపీటీ 5204-88 బస్తాలు 25కేజీల బస్తా రూ. 1083, కెఎన్ఎం118 రకం 60 బస్తాల ఉన్నాయని, 25 కేజీల బస్తా ధర 995, అలాగే ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని వచ్చి తీసుకెళ్లాలని కోరారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

వనపర్తి క్రైం, జూన్ 10: పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎస్పీ నాగర్ కర్నూల్ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఆయా మండలాల ఎస్ఐలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొత్తం ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మోహన్ కుమార్



వనపర్తి క్రైం, జూన్10: రాష్ట్రంలోని 33 జిల్లాల ఫెడరేషన్ ఆఫ్ జిల్లా కోర్టుల అధ్యక్షులకు సంబంధించి రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా వనపర్తి జిల్లా కోర్టు అధ్యక్షుడు మోహన్ కుమార్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం హైదరాబాద్, రంగారెడ్డి కోర్టులో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు మోహన్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర కమిటీలో ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి బాధ్యతతో పని చేస్తానని ఆయన తెలిపారు.

కౌన్సిలర్‌పై కమిషనర్‌కు ఫిర్యాదు

అమరచింత, జూన్ 10: ఇంటి ముందర ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని కౌన్సిలర్‌పై పలువురు కాలనీవాసులు సోమవారం అమరచింత మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పదో వార్డులోని కౌన్సిలర్ ఇంటి ముందు ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని వారు అన్నారు. అక్రమ కట్టడాలను, ఆక్రమణలను అడ్డుకోవాల్సిన కౌన్సిలరే ఇంటి ముందు స్థలాన్ని ఆక్రమించాలని చూడడం ఎంత వరకు న్యాయమని వారు ప్రశ్నించారు. కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో కాలనీవాసులు తాజుద్దీన్, ఖాజమైనోద్దీన్, అబ్దుల్ ఖాదర్, రుక్మోద్దీన్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

నిబంధనలను ఉల్లంఘించిన విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, జూన్ 10: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫాం,షూ, స్టడీ మెటీరియల్ విక్రయిస్తున్న పాఠశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం మండల విద్యాధికారి భాస్కర్ సింగ్‌కు డిమాండ్ పత్రాన్ని అందజేశారు. ప్రైవేటు పాఠశాలల యజమాన్యం విద్యను వ్యాపారం చేస్తున్నారని, పాఠశాలల్లో యూనిఫాం, షూ, స్టడీ మెటీరియల్ విక్రయించడం సరికాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలల యజమాన్యాలపై చర్యలు తీసుకొని పాఠశాలల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.